సులువుగా.. సౌకర్యవంతంగా

- కేజీహెచ్‌లో అందుబాటులోకి డిజిటలైజేషన్ ల్యాబ్
- రక్తపరీక్షలు.. రిపోర్టులకు కష్టపడక్కర్లేదని రోగుల హర్షం



(నాడు) పాత రక్త పరీక్ష కేంద్రం వద్ద ఇబ్బంది పడుతున్న జనం



(నేడు) కొత్తగా ఏర్పాటైన రక్త పరీక్ష కేంద్రం వద్ద హడావుడి లేకుండా పరీక్షలు

వెనుకటి రోజుల్లో కేజీహెచ్‌లో రక్తపరీక్షలు చేయించుకుని.. రిపోర్ట్ రావాలంటే తల ప్రాణం తోకకు వచ్చేది. చాంతాడంత క్యూ వల్ల రక్తపరీక్ష కోసం వచ్చే రోగుల వంతు రావడానికి గంటల కొద్దీ సమయం పట్టేది. తీరా రక్తపరీక్ష చేయించుకున్న తర్వాత రిపోర్ట్ చేతికి రావాలంటే అంతే సంగతులు. రోజులు పట్టేవి. ఈ సమస్యకు చెక్ పెట్టడానికి కేజీహెచ్‌లో ఇటీవల ప్రారంభించిన డిజిటలైజేషన్ విధానం సత్ఫలితాలిస్తోంది. దీంతో రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కేజీహెచ్ (ఫైల్)

మహారాణిపేట : ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య ప్రదాయిని కింగ్ జార్జి ఆస్పత్రిలో నూతనంగా ప్రవేశ పెట్టిన రక్త పరీక్షల విధానం మంచి ఫలితాలు ఇస్తోంది. గతంలో ఈ పరీక్షల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. అలాగే పరీక్షల రిపోర్టు కోసం రోజుల తరబడి నిరీక్షణ తప్పేది కాదు. దీంతో పలు రోగాలతో రక్తపరీక్షలు చేయించుకునే రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కానీ ఇప్పుడు అన్ని విభాగాలకు బ్లడ్ శాంపిల్స్ తీసుకునే డిజిటలైజేషన్ విధానం అమల్లోకి రావడంతో రోగుల కష్టాలు తీరాయనే చెప్పాలి. బయో కెమిస్ట్రీ, మైక్రో పాథాలజీ డిపార్టుమెంట్లను కలిపి డిజిటలైజేషన్ ల్యాబ్‌ను ప్రారంభించారు. రోగులకు సౌలభ్యంగా ఉన్న ఈ విధానం ద్వారా త్వరితగతిన పరీక్షలు జరిగి, ఫలితాలు వస్తున్నాయి. ఈ విధానానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందించడం వల్ల రక్త పరీక్షల ల్యాబ్‌ను ఆన్‌లైన్ చేసి రోగులకు సేవలందిస్తున్నారు.

గత కష్టాలకు చెక్..

వివిధ పరీక్షల కోసం కేజీహెచ్‌కు వచ్చే రోగులు గతంలో ఎన్నో కష్టాలు పడేవారు. అయితే నాటి ప్రభుత్వాలు ఈ సమస్యను ఏనాడూ పట్టించుకోలేదు. పరీక్షలు, రిపోర్టుల కోసం రోగులు కేజీహెచ్‌లోని వార్డుల్లో ప్రదక్షిణలు చేసేవారు. పరీక్షలు చేయించుకోవడం, రిపోర్ట్స్ కోసం ల్యాబ్‌ల చుట్టూ తిరక్కుండా ఉండేందుకు వారి సెల్‌కే సమాచారం వచ్చే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ రిపోర్టుల్ని బట్టి వైద్యుల దగ్గరకు నేరుగా వెళ్లి చికిత్స చేయించుకునే వెసులుబాటు రోగులకు దక్కింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో 40 లక్షల రూపాయలతో ఈ–ఆస్పత్రి కేజీహెచ్‌లో రూపుదిద్దుకుంటోంది. అందులో భాగంగా తొలి విడతగా రక్తపరీక్షల ల్యాబ్‌ను మొదలుపెట్టారు.

ఈ విధానం చాలా బాగుంది..



అనారోగ్య సమస్యల వల్ల ఆస్పత్రికి వచ్చాను. పరీక్షలు చేయాలని వైద్యులు సూచించారు. ఈ మేరకు పరీక్షల కోసం ల్యాబ్‌కు వెళ్లాను. గతంలో వలె కాకుండా రక్త పరీక్ష త్వరగా పూర్తి అయింది. రిపోర్టులు కూడా త్వరగా వచ్చేసాయి. వెనుకటి రోజుల్లో రక్తపరీక్షకు మన వంతు రావడానికి, రిపోర్టులు చేతికందడానికి చాలా ఆలస్యమయ్యేది. కాని నేడు త్వరగా పరీక్షలు పూర్తయి, రిపోర్టులు వచ్చేస్తున్నాయి. దీని వల్ల డాక్టర్ల వద్దకెళ్లి సరైన వైద్యం చేయించుకోవడానికి అనువుగా ఉంటుంది. ఈ విధానం చాలా బాగుంది. ఎలాంటి ఇబ్బంది లేకుండా కేజీహెచ్‌లో వైద్యం అందుతోంది.

– నరసింహులు, యారాడ

ఇక సులువుగా రక్తపరీక్షలు..



కేజీహెచ్‌లో డిజిటలైజేషన్ ల్యాబ్ ప్రారంభం ఉత్తరాంధ్ర ప్రజలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు ఎంతో వెసులుబాటుగా ఉందని చెప్పొచ్చు. ఇక్కడ డిజిటలైజేషన్ ఎలక్ట్రానిక్ ల్యాబ్ (రక్త పరీక్షల కేంద్రం) ప్రారంభమైంది. ఇటీవల కేజీహెచ్‌లోని రాజేంద్ర ప్రసాద్, భావనగర్ వార్డులు, సీఎస్‌ఆర్ బ్లాక్‌లలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాలకు అనుసంధానం చేస్తూ ఇది ఏర్పాటైంది. రెండో విడతలో ఎక్స్‌రేలు నిర్వహించడానికి ప్రయత్నం చేస్తున్నాం. త్వరలో అన్ని రకాల పరీక్షలు ఆన్‌లైన్ అవుతాయి.

– డాక్టర్ పి.అశోక్‌కుమార్, కేజీహెచ్ సూపరింటెండెంట్

నాయకత్వ లక్షణాలతో సమర్థవంతమైన సేవలు



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జోన్–4 జేసీఐ మెంటార్ కేవీ రావు తదితరులు

అల్లిపురం : సమాజానికి సేవ చేసే సంస్థల యజమానులు, సభ్యులు ముందుగా నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని జోన్–4, జేసీఐ మెంటార్ కేవీ రావు అన్నారు. అన్ని అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జేసీఐ వాల్తేరు, జేసీఐ విశాఖ మెట్రో, జేసీఐ వైజాగ్ అచీవర్స్ సంయుక్తంగా ఆదివారం నగరంలో రాక్‌డేల్ హోటల్లో సమర్థవంతమైన ప్రజా ప్రసంగ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ఇతర సమస్యలపై అవగాహన కలిగి ఉంటే సత్వరమే పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. జేసీఐ విశాఖ వ్యాలీ అధ్యక్షురాలు ఇంద్రజ శంకు, జేసీఐ వైజాగ్ అచీవర్స్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, జోన్–4 అధ్యక్షుడు సురేష్ గొంప, జోన్–4 ట్రైనర్ రామరాజు కో పైలట్‌గా వ్యవహరించారు. దాదాపు 30 మంది శిక్షణలో పాల్గొన్నారు.

బౌద్ధ సమ్మేళనం విజయవంతానికి పిలుపు

పెదగంట్యాడ: ఈ నెల 25 ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకూ నగరంలోని రామాటాకీస్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న 11వ బౌద్ధ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన బౌద్ధ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న బౌద్ధ భిక్షువులు ఈ కార్యక్రమానికి తరలి రానున్నారని తెలిపారు.

క్లుప్తంగా

అనుబంధ కమిటీ నాయకులకు అభినందన



ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న పెంటపల్లి వెంకట్, శిరీష

మహారాణిపేట : జీవీఎంసీ 30వ వార్డుకు చెందిన పలువురు నాయకులకు వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో స్థానం కల్పించారు. జిల్లా చేనేత విభాగం కమిటీ ఉపాధ్యక్షుడిగా పెంటపల్లి వెంకట్, ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీగా దండాసుల శిరీషను నియమించడంతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వారిని అభినందించారు. ఆదివారం వార్డులో జరిగిన కార్యక్రమంలో వారు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ వడ్డాది దిలీప్‌కుమార్, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



మహారాణిపేట : వైఎస్సార్‌సీపీ జిల్లా చేనేత విభాగం ఉపాధ్యక్షుడు పెంటపల్లి వెంకట్‌ను ఇసుకకొండ శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సభ్యునిగా నియమించారు. బుధవారం ఉదయం 11 గంటలకు ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. ఈ నియామకం పట్ల వెంకట్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాలగుమ్మికి ఘంటసాల పురస్కార ప్రదానం రేపు



ఘంటసాల పురస్కారం అందుకోనున్న పాలగుమ్మి

అల్లిపురం : అమర గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా ప్రముఖ సినీ గాయకుడు, సంగీత దర్శకుడు పాలగుమ్మి రాజగోపాల్‌కు ఘంటసాల సేవా పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగే ఘంటసాల సినీ సంగీత విభావరిలో ఖ్యాతి గాంచిన గాయనీ గాయకులు ఘంటసాల గీతాలు ఆలపిస్తారని పేర్కొన్నారు. అనంతరం సాలూరి రాజేశ్వరరావు వద్ద సహ సంగీత దర్శకుడిగా పని చేసిన పాలగుమ్మి రాజగోపాల్‌కు ఆత్మీయ సత్కారం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.సుహాసిని ఆనంద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

భారత సంస్కృతి, నాగరికతపై అవగాహన అవసరం

ఎంవీపీ కాలనీ: పాశ్చాత్య దేశాలు విశ్వసిస్తున్న భారతదేశ సంస్కృతి, నాగరికతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పండిట్ వామదేవ శాస్త్రి సూచించారు. శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'రీకన్‌స్ట్రక్టింగ్ ది కల్చరల్ హిస్టరీ ఆఫ్ భారత' అంశంపై రెండు రోజుల సింపోజియంను ఎంవీపీ కాలనీలోని ఐఐఎం వేదికగా నిర్వహించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి పండిట్ వామదేవ శాస్త్రి మాట్లాడుతూ భారతదేశం గొప్ప, సజీవమైన నాగరికతను కలిగి ఉందన్నారు. అయితే చాలా మంది పాశ్చాత్య చరిత్రకారులు భారత సంస్కృతిని వక్రీకరించి రాశారన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రాచీన చరిత్ర మూలాలను, నాగరికతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతో పాటు ప్రపంచానికి అందించాలన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధాకుమారి మాట్లాడుతూ భారత చరిత్రకారులు రాసిన మనదేశ చరిత్ర కొంత మేర వెలుగులోకి రాలేదన్నారు. ఈ నేపథ్యంలో శివానంద సుపథ ఫౌండేషన్ ద్వారా ప్రాచీన భారత చరిత్రను నేటితరానికి వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యా సిబ్బంది

జగదాంబ : శంకర్ ఫౌండేషన్, స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 39వ వార్డులోని స్వామి వివేకానంద సంస్థలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జీవీఎంసీ అదనపు కమిషనర్ వై. శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు, కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ ఇరవై రెండు సంవత్సరాలుగా స్వామి వివేకానంద సంస్థ అనేక సేవలందించడం అభినందనీయమన్నారు. అనాథ తల్లులకు ఆశ్రయం కల్పిస్తూ సేవాపథంలో ముందు వరసలో ఉందన్నారు. వైద్య శిబిరాలను అందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులను ఆయన పరామర్శించారు. హాజరైన రోగులకు అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

చురుగ్గా స్టేడియం అభివృద్ధి పనులు



ఇందిర మున్సిపల్ స్టేడియం

జగదాంబ : ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం పనులు చురుగ్గా సాగుతున్నాయి. జీవీఎంసీ 35వ వార్డులో 1972వ సంవత్సరంలో నిర్మించిన ఈ స్టేడియం గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు స్టేడియం లోపల అనేక స్థలాలను ఆక్రమించుకుని ఉపయోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వైస్సార్‌సీపీ ప్రభుత్వం స్టేడియం అభివృద్ధిపై దృష్టి సారించింది. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి స్టేడియం అభివృద్ధికి రూ. కోటి అరవై లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో అయిదు విభాగాలుగా రహదారులు, గ్యాలరీ, పెవిలియం బాక్స్, బాత్రుమ్‌లు, స్టేడియం లోపల అండర్ గ్రౌండ్ కాలువల పనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇప్పటికే పెవిలియం బాక్స్‌లు, కాలువ పనులు పూర్తయ్యాయి. గ్యాలరీలకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. తర్వాత స్టేడియం చుట్టూ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

చదవని పుస్తకాలు డొనేట్ చేయండి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గ్రంథాలయ గాంధీ వెలగా వెంకటప్పయ్య 9వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక పురస్కారాన్ని ఉండ్రాజవరం గ్రంథపాలకుడు నున్న వెంకట రామారావుకు ఆచార్య పి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.మూర్తి రచించిన 'డెవలప్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ అండర్ సీఎస్ఆర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పబ్లిక్ లైబ్రరీల పరిస్థితి ఇబ్బందికరంగా ఉందన్నారు. దీనికి కారణం ఫిజికల్ బుక్స్‌కు ప్రత్యామ్నాయంగా డిజిటల్, ఎలక్ట్రానిక్ బుక్స్ వచ్చాయని చెప్పారు. చేతిలో మొబైల్ ఉంటే గూగుల్ చేస్తే అన్ని పుస్తకాలు మన వద్ద ఉన్నాయన్న భావన పాఠకులు, విద్యార్థుల్లో కనిపిస్తోందన్నారు. పుస్తకాన్ని చదువుతుంటే వచ్చే ఆనందం.. మొబైల్, కంప్యూటర్స్‌లో చదివితే రాదన్నారు. కంపెనీలు తమ లాభాల్లో కొంత భాగాన్ని సీఎస్ఆర్ కింద పబ్లిక్ లైబ్రరీల అభివృద్ధికి ఇచ్చేలా సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ కృషి చేసిందని కొనియాడారు. విశాఖ పౌర గ్రంథాలయం అభివృద్ధే దీనికి నిదర్శనమన్నారు. చాలా మంది వద్ద పుస్తకాలు చదవకుండా ఉన్నాయని, వాటిని ప్రజలకు ఇచ్చేలా బుక్ డొనేషన్ క్యాంపెయిన్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వెలగా ర్వోత్తమరావు, ఎం.కోటేశ్వరరావు, సాంబశివరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కుర్తాళం పీఠాధిపతికి ఘన స్వాగతం



సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

సీతంపేట: అమృతోత్సవం పేరిట నిర్వహిస్తున్న శ్రీలలితా పీఠం 75వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు కుర్తాళం పీఠాధిపతి, జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆదివారం అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి వచ్చారు. కుర్తాళం నుంచి వచ్చిన స్వామీజీ, శక్తి పీఠాధీశ్వరి రామ్యానంద భారతీ స్వామినిలకు పీఠం వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభం, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి దారి పొడుగునా పూలతో ఆహ్వానించారు. ఈ నెల 19 నుంచి 24 వరకు పీఠాధిపతి సమక్షంలో అమృతోత్సవాలు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అర్చకులు అందజేశారు.

అంగరంగ వైభవంగా ఎరుకుమాంబ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు



ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



దొండపర్తిలో ఎరుకుమాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగిస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు గంగవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పూర్ణాహుతి (హోమం) నిర్వహించారు. అలాగే 108 కలశాలతో భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఆలయ ఈవో జి. రమాబాయి ఆధ్వర్యంలో సాయంత్రం ఊరేగింపు అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ఈ కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అమ్మవారి విగ్రహ దాతలు రాపర్తి శివసాయి, సంగీత దంపతులు, అన్నదాన దాత సీహెచ్ సత్యం, ధర్మకర్తలు పిల్లి స్వాతి, పి.లక్ష్మీనారాయణమ్మ, పిల్లి దుర్గ, దళాయి అన్నపూర్ణ, పెద్దాడ రమణమ్మ, బంటుపల్లి సూర్యనారాయణ, కె.బ్రహ్మాజీ, శరగడం నర్సింగరావు, సిబ్బంది సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

రేపటి నుంచి విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు



అరిలోవ: బీఆర్‌టీఎస్‌ని ఆనుకుని హనుమంతవాక వద్ద విజయ దుర్గా కాలనీలో కొలువుదీరిన విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఆవరణలో విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఇందులో భాగంగా 20న ఉదయం 6 గంటల నుంచి సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజతో ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలు అనంతరం పెదగదిలి వద్ద పోలమాంబ గుడి నుంచి 108 కలశాలతో మహిళలు విజయదుర్గాకాలనీ వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ అమ్మవారికి క్షీరాభిషేకం చేయనున్నారు. సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించనున్నారు. 21న సామూహిక లక్ష కుంకుమార్చనలు, 22న మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదానం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, జాతర నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎస్.ఎన్.రాజు తెలిపారు.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ఛాయా ఉషా సమేత శ్రీ సూర్యనారాయణమూర్తి

అల్లిపురం : వెంకటేశ్వరమెట్టపై అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో మాఘమాసం రెండవ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు ప్రత్యేకంగా గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం మందార, చామంతి, గులాబీ పూలతో స్వామి వారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఉదయం 7.20 నిమిషాల ప్రాంతంలో సూర్య కిరణాలు గర్భగుడిలో గల మూలవిరాట్టును తాకటంతో ఆలయ ప్రాంగణం ఆదిత్య నామాలతో మార్మోగింది. భక్తులు కనులారా ఆ దృశ్యం వీక్షించి తరించారు. అనంతరం ఆలయ అర్చకుడు స్వామివారికి ఏక హారతి, నక్షత్ర హారతి వరకు సప్త హారతులు అందజేశారు.

పద్య, గేయ రచయితలకు సత్కారం



రచయితలను సత్కరిస్తున్న ఆచార్య బేతవోలు, డాక్టర్ రఘురామారావు

సీతంపేట: ఇటీవల తానా నిర్వహించిన పద్య, గేయ కావ్యాల పోటీల్లో విజేతలకు సత్కార కార్యక్రమం విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. మొదటి స్థానం గెలుపొందిన పద్యకావ్యం 'జీవన వాహిని' రచయిత బులుసు వెంకటేశ్వర్లు, 'యువావతరణము' గేయ కవిత్వాన్ని రచించిన రాంభట్ల నృసింహశర్మ, 'సామాజిక త్రిశతి' శతక కర్త సీహెచ్ చిన సూర్యనారాయణలను ముఖ్య అతిథి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం చేతుల మీదుగా దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బేతవోలు మాట్లాడుతూ తానా సంస్థ చేస్తున్న సాహిత్య సేవ ప్రశంసనీయమని, ఇటీవల పుస్తక ప్రచురణ కూడా పెద్ద ఎత్తున చేపట్టిందన్నారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి రచనలను నాలుగు సంపుటాల్లో ప్రచురించిందని గుర్తుచేశారు. సమాజానికి మేలుచేసే ఆధునిక ఇతివృత్తంతో తానా నిర్వహించిన పద్య, గేయ రచనల్లో విశాఖకు చెందిన ముగ్గురు రచయితలు చేసిన రచనలు ఉత్తమమైనవిగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జీవన వాహిని పద్య కావ్యం రచయిత అద్భుతమైన పద్య రచనా శైలిని ఆద్యంతం ప్రతిబింబిస్తుందన్నారు. భారతీయ జీవన విధానంలో వచ్చిన మార్పులపై అలవోకగా అనుప్రాసలతో యువావతరణము గేయ కావ్యం ఆకట్టుకుందన్నారు. పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నెహ్రూ అవార్డులు



సీఎండీ నుంచి అవార్డు అందుకుంటున్న ఉద్యోగి జయరాజు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 105 మంది ఉద్యోగులకు యాజమాన్యం జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులను ప్రదానం చేసింది. స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకత, క్రమశిక్షణ కలిగిన ఉద్యోగులకు ఏటా ఉక్కు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకల్లో నెహ్రూ అవార్డులు అందజేస్తారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం ఉక్కునగరం ఎంపీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో సీఎండీ అతుల్ భట్ చేతుల మీదుగా 56 మంది అధికారులు, 49 మంది కార్మికులు అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా ప్రతిభ చూపిన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి కమెండేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు డీకే మొహంతి, బాగ్చీ, ఎస్.సి. పాండేతోపాటు పలువురు ఉన్నతాధికారులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.